క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం, శతభిష నక్షత్రం దశమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతులపూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నీటి సంఘాల ఓటర్ల జాబితా సవరణకు ప్రకటన



ఓటర్ల జాబితా ప్రకటనను ప్రదర్శిస్తున్న అధికారులు

పర్చూరు (చినగంజాం): నీటి సంఘాల ఓటర్ల జాబితాలో సవరణకు ప్రకటన విడుదల చేసినట్లు పర్చూరు తహశీల్దార్ పీ బ్రహ్మయ్య తెలిపారు. ఆదివారం ఎమ్మార్వై ప్రేమ్ కుమార్ ఉప్పుటూరు, నూతలపాడు, చెరుకూరు, రమణాయపాలెం సచివాలయాల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నోటీసులను అంటించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో ప్రస్తుత నీటిసంఘాల ఓటర్ల జాబితా సిద్ధంగా ఉందని తెలిపారు. రైతులు ఓటర్ల జాబితాను పరిశీలించి తమ పేర్లు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలన్నారు. సంబంధిత గ్రామాల రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల నేడు, రేపు రెవెన్యూ కార్యాలయంలో తెలపాలని సూచించారు. ఈనెల 13వ తేదీన ఓటర్లు తుదిజాబితా ప్రచురిస్తారని తహశీల్దార్ తెలిపారు.

బ్రాహ్మణ సమాఖ్య సేవలు కొనసాగించాలి



మాట్లాడుతున్న సమాఖ్య అధ్యక్షుడు ప్రయాగరావు

వేటపాలెం: మృగయాపురి బ్రాహ్మణ సమాఖ్య సేవలు కొనసాగించాలని అప్పా జోస్యుల సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో మృగయాపురి బ్రాహ్మణ సమాఖ్య కార్తీక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సమాఖ్య అధ్యక్షులు స్వర్ణ ప్రయాగరావు మాట్లాడుతూ పేద బ్రాహ్మణ అభ్యున్నతికి కృషిచేస్తామన్నారు. అన్ని రంగాల్లో బ్రాహ్మణులు రాణించాలన్నారు. సమాఖ్య చేస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి కే సుబ్రహ్మణ్యకుమార్, రావినూత మురళీకృష్ణ, కురుగంటి మల్లికార్జునశాస్త్రి, గోపినాథరావు, కారంచేటి శివరామకృష్ణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నీడ లేక.. నిలవ లేక !



రొంపేరు కాల్వ పక్కన ఫ్లోరింగ్ కుంగిపోయి అధ్వానంగా మారిన బస్ షెల్టర్



బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండే కాలువ సెంటర్

- బస్సు షెల్టర్ లేక ఎండ,వానలకు తప్పని తిప్పలు
- పందులకు, ఆకతాయిలకు ఆవాసాలుగా మారిన వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం, అధికారులు



పోకిరీలు, ఆకతాయిలకు అడ్డాగా మారిన బస్ షెల్టర్

కారంచేడు: ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం. బస్సు ఆక్యుపెన్సీని పెంచుదాం-బస్సుల్లోనే ప్రయాణిద్దాం. ఆటో ప్రయాణాలు ప్రమాదకరం.. ఇవి నిత్యం రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) అధికారులు, పాలకులు పలికే ప్రగల్భాలు. ఏ బస్సులో చూసినా ఇదే ప్రచారాలు. ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు అనుకూలమైన పరిస్థితులు, వసతులు కల్పించడంలో మాత్రం ఘోరంగా విఫలమయ్యారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండే బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారుతున్నాయి. వీటిని పరిశీలించి ప్రయాణికులకు అందుబాటులో ఉంచాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అయినా సంబంధిత అధికారుల్లో చలనం కరువైంది. మండల కేంద్రం కారంచేడులో వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో చీరాల-పర్చూరు మధ్య ఉన్న కారంచేడు అంబేడ్కర్ కాలనీ నుంచి కాలువ సెంటర్ వరకు ఐదు బస్ స్టాప్‌లు ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు ఈ ఐదు సెంటర్లలోనూ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో కేవలం మధ్య బస్టాప్‌లోని బస్ షెల్టర్ మినహా ఏ ఒక్క బస్ షెల్టర్ వినియోగంలో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి సాక్షాలుగా మారాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా..

దశాబ్దాల క్రితం నిర్మాణం చేసిన ఈ బస్ షెల్టర్ ప్రయాణికులకు ఉపయోగమే లేదు. కారణం రొంపేరు కాలువ ఒడ్డున నిర్మాణం చేపట్టడం వలన ఫ్లోరింగ్ పూర్తిగా కుంగిపోయింది. నాపరాళ్లు పగిలిపోయాయి. దీంతో సమీప ప్రజలు వాటిని మాయం చేశారు. ప్రస్తుతం ఇక్కడ మనిషి లోతు వరకు మట్టి కోతకు గురైంది. రాత్రి సమయాల్లో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో అక్కడ బస్సుల కోసం నిలబడేందుకు కూడా భయంగా ఉంటుందని వారు వాపోతున్నారు. రాత్రిపగలు, ఎండవానల్లో బస్సుల కోసం పడిగాపులు పడాల్సిందే.

మరమ్మతులు కూడా చేయని అధికారులు..

పోలీస్టేషన్ సెంటర్‌లోని బస్ స్టాప్‌లో గతంలో పందులకు ఆవాసాలుగా మారాయి. ప్రస్తుతం అక్కడ దుకాణాలు ఏర్పాటు చేయడంతో అవి కూడా నిరుపయోగంగానే మారాయి. ఇది కూడా దశాబ్దాల క్రితం నిర్మాణం అయినదే. నిర్మాణ కాలం నుంచి నేటి వరకు వీటి మరమ్మతులకు ఎలాంటి చర్యలు లేవని ప్రయాణికులు వాపోతున్నారు. దీనిలో ప్రతి రోజు పందులు, కుక్కలు సేద తీరుతుండేవని చెప్తున్నారు. అక్కడకు వెళ్లి ప్రయాణికులు నిలబడాలన్నా దుర్వాసనతో అక్కడకి వెళ్లలేకపోతున్నామని వారు వాపోతున్నారు.

> **బస్ షెల్టర్లను వాడుకలోకి తీసుకురావాలి..**
>
> కారంచేడులో ఉన్న బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. చాలా చోట్ల ప్రయాణికులకు షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉన్నా ఉపయోగం లేకుండా ఉన్నాయి. కనీసం వాటి సమీపంలో నిలబడటానికి కూడా ఇబ్బందిగానే ఉంటుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్ షెల్టర్లను వాడుకలోకి తీసుకురావాలి.
>
> – ఎస్ జోనేష్, కారంచేడు
>
> **బస్ షెల్టర్లు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది..**
>
> ప్రతి రోజూ కూరగాయలు, పండ్ల వ్యాపారానికి నేను బస్సుల్లో ప్రయాణిస్తుంటాను. ఒక సారి కాలువ సెంటర్, మరొకసారి పోలీస్టేషన్ సమీపంలో నేను బస్సు దిగుతుంటాను. కనీసం నీడ కూడా ఉండదు. చాలా ఇబ్బందిగా ఉంటుంది. అంతా దుర్గంధం వస్తుంటుంది.
>
> – డీ మహేశ్వరి, కారంచేడు

పోకిరీలకు అడ్డగా బస్‌స్టాప్ ..

నిత్యం వందల మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే కాలువ సెంటర్ బస్‌స్టాప్ సెంటర్‌కు దూరంగా ఉంటుంది. దీంతో ప్రయాణికులు అక్కడకు వెళ్లరు. బస్సులు అక్కడ ఆగవు. పర్చూరు, చీరాల, కుంకలమర్రు, స్వర్ణ, ఇంకొల్లు వైపు ప్రయాణించే ప్రయాణికులు ఇక్కడ బస్సుల కోసం నిలబడతారు. ప్రతి రోజు ఈ సెంటర్ నుంచి వందల సంఖ్యలో బస్సులు ఎక్కడం, దిగడం చేస్తుంటారు. అయినా ఇక్కడ బస్ షెల్టర్ లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. చీకటి పడితే బస్ షెల్టర్‌లో ఆకతాయిలు, పోకిరీలు చేరుతుంటారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్ షెల్టర్‌లను మరమ్మతులు చేయించి ప్రజలకు, ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రతి రోజు ఉద్యోగాలకు, పాఠశాలలకు, కాలేజీలకు, వ్యాపారాల నిమిత్తం ప్రయాణించే ప్రయాణికులు బస్ షెల్టర్లతో నానా అగచాట్లు పడుతున్నారు.

13న సర్వసభ్య సమావేశం

మేదరమెట్ల: కొరిశపాడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె ప్రకటనలో కోరారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

చీరాల అర్బన్: పేదలకు ఎప్పుడూ రోటరీ అండగా ఉంటుందని రోటరీ క్లబ్ క్షీరపురి అధ్యక్షుడు బాచిన నాగమల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక నవాబుపేటలోని ప్రతాప్ ఇండస్ట్రీస్‌లో పేద విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు వీలుగా ఐదుగురు విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా సైకిళ్లు పంపిణీ చేయడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మువ్వల వంశీకృష్ణ, కోశాధికారి డాక్టర్ బి.రవితేజ, క్లబ్ సభ్యులు టి.దేవరాజు, రమణ, రామకృష్ణ, రమణరావు, డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు



ఓటరు లిస్టులను పరిశీలిస్తున్న తహసీల్దారు అనిత

కారంచేడు: ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఓటర్ క్యాంపును అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా నమోదులతో పాటు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని ఇన్‌చార్జ్ తహసీల్దారు అనిత పేర్కొన్నారు. ఆదివారం ఆమె మండలంలోని కారంచేడు, స్వర్ణ, కొడవలివారిపాలెం గ్రామాల్లో ఓటరు క్యాంపులను ఆమె పరిశీలించారు. ఓటర్లు క్యాంపు వద్దకు వచ్చి మీ ఓట్లను పరిశీలించుకోవాలన్నారు. అలాగే ఓటరు లిస్ట్‌లో పేర్లు మార్పులు, చేర్పులున్నా, తొలగింపుల వంటి వాటిని పరిశీలించుకోవాలన్నారు. ఓటర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి ప్రజలకు సర్వీస్‌ను అందించాలన్నారు. నిర్లక్షంగా ఉండి పాయింట్లలో బీఎల్‌ఓలు లేకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగుదాం

- సినీ యాక్టర్, వైస్సార్ సీపీ అధికార ప్రతినిధి శ్యామల రెడ్డి
- వైభవంగా రెడ్డి జనసేవా సంఘం కార్తీక వనసమారాధన



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి శ్యామల రెడ్డి

చీరాల టౌన్: రెడ్డి అంటే ఒక కులం కాదు ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడటం.. అని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, సినీ యాక్టర్, యాంకర్ ఆరె శ్యామల రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కేపాల్ మస్తాన్‌రెడ్డి బ్రహ్మాస్ అతిథి గృహంలో రెడ్డిజన సేవా సంఘం 25వ కార్తీక వన సమారాధన, సిల్వర్ జూబ్లీ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చేతనైన సాయం చేసి తోటి వారికోసం ముందుండి నడిపించే నైజం ఉన్న వ్యక్తులు రెడ్లు అని చెప్పారు. రెడ్డి సంఘీయులు అందరూ ఐక్యంగా ఉండి అందరికి ఆదర్శంగా నిలుద్దామని ఆమె పిలుపినిచ్చారు. రెడ్డి కులస్తులు ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తారన్నారు. చీరాల రెడ్డి జనసేవా సంఘం గత 25 ఏళ్లుగా చీరాల ప్రాంతంలో చేస్తున్న సమాజ సేవా కార్యక్రమాలు గొప్పగా చేయడమే అందుకు నిదర్శనమన్నారు. ప్రపంచాన్నే కుదిపేసిన కరోనా విపత్కర సమయంలో నియోజకవర్గంలో రెడ్డి జనసేవా సంఘం చాలా సహాయ కార్యక్రమాలు చేశారని, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. నియోజవర్గంలో రెడ్డి సంఘీయులు అందరూ ఐక్యంగా ఉండి సంఘం అభివృద్ధితో పాటుగా సమాజాభివృద్ధిలో తమవంతుగా సహకారాన్ని అందించాలన్నారు. రెడ్డి జనసేవా సంఘం మహిళా విభాగం, యూత్ విభాగాన్ని కూడా ఏర్పాటు చేయడంతో పాటుగా డిజిటలైజేషన్ ద్వారా సభ్యత్వాలు కల్పించాలన్నారు. ఏడాదికి ఒక్కసారి కాకుండా ప్రతీ సంఘస్తుడు తరచూ కలవడంతో పాటుగా నిరుపేదలు, ఇబ్బందుల్లో ఉన్న సంఘస్తులకు తమ వంతుగా సహకారాన్ని అందించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఐకమత్యంతో ఉన్నప్పుడే ఏదైనా సాధిస్తామని అందరం ఒకటే అనే భావనతో మెలిగి అటు సామాజికంగా, సేవా కార్యక్రమాలు, సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. చీరాల రెడ్డి జనసేవా సంఘం అభివృద్ధికి తాను పూర్తి సహకారం అందిస్తానని శ్యామల రెడ్డి తెలిపారు. మరో అతిథి గుంటూరు బ్రింద హాస్పిటల్ ఎండీ, ప్రముఖ బాహుబలి వైద్యుడు భవనం హనుమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చీరాల ప్రాంతంలో రెడ్డి సామాజిక వర్గీయులు అందరూ ఏకతాటిపై ఉంటూ కార్తీక వన సమారాధన చేయడం అభినందనీయమన్నారు. అందరూ ఐక్యంగా ఉండి సమాజ అభివృద్ధిలో కీలకంగా ఉండాలన్నారు. యోగివేమా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్, కోటప్పకొండ అధ్యక్షుడు కంజుల వీరారెడ్డి మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో రెడ్డి సామాజిక వర్గీయులు అధికంగా ఉన్నారని, ట్రస్టు ద్వారా నిరుపేదలకు విద్య, వైద్యం సేవాకార్యక్రమాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యదర్శి పోలిమేర వెంకటరెడ్డి మాట్లాడుతూ వ్యాపారం, రాజకీయం, సేవా కార్యక్రమాల్లో అందరం ముందంజలో ఉన్నప్పుడే ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు.

ఆలోచింపజేసిన ఆధ్యాత్మిక ప్రవచనం..

రెడ్డి జనసేవా సంఘం కార్తీక వన సమారాధనలో భాగంగా ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రవచనం, మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అలానే పవర్ లిఫ్టింగ్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి త్వరలో తమిళనాడులోని సేలంలో జరగనున్న సౌత్ ఇండియా లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించిన లిఫ్టర్ టి.వేదశ్రీకి రెడ్డి జనసేవా సంఘం తరపున బాహుబలి వైద్యుడు భవనం హనుమ శ్రీనివాసరెడ్డి రూ.25 వేలు, మిగతా నగదు సంఘం తరపున అందించారు. మొత్తం రూ.38 వేలు కలిపి శ్యామలరెడ్డి అందించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

అలానే పలు ప్రాంతాల నుంచి వచ్చిన రెడ్డి సంఘం ప్రతినిధులు తమ ప్రాంతంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి వివరించారు. సంఘస్తులు అందరూ ఐక్యంగా ఉంటామని, ఆపదలో ఉన్నవారికి చేయూత, సహకారం అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేసిన కొందరిని అతిథులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి అధ్యక్షుడిగా భవనం బద్రిరెడ్డి వ్యవహరించారు. సంజీవరెడ్డి, గిరిధర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, అనీల్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, హరినాథరెడ్డి, నారాయణరెడ్డి, శంకర రెడ్డి, అంజిరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డితో పాటుగా నియోజకవర్గంలోని ప్రాంతాలకు చెందిన రెడ్డి సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వనసమారాధనకు హాజరైన రెడ్డి జనసేవా సంఘం ప్రతినిధులు, కుటుంబ సభ్యులు



వెయిట్‌లిఫ్టర్ వేదశ్రీకి నగదు అందిస్తున్న సంఘ ప్రతినిధులు

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



విద్యార్థులచే పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్

సంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకుంటే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే దేశభక్తి, కథలు, మహాత్ముల చరిత్ర పుస్తకాలను చదివించారు. కార్యక్రమంలో 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మకుండంలో స్నానాలకు ఏర్పాటు



బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు



తూటికాడ తొలగిస్తున్న కార్మికులు



మర్రిచెట్టుపై ప్రతిష్ఠించిన జంట నాగులు

బల్లికురవ: శివకేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మకుండంలో స్నానాలు చేసేందుకు జిల్లాతోపాటు పరిసర మండలాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాట్లు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కొణిదెన గ్రామానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. 12వ శతాబ్దంలో ఈ గ్రామాన్ని రాజులు పరిపాలిస్తున్నట్లు చరిత్ర చెప్తోంది. గ్రామం నుంచి నక్కబొక్కలపాడు వెళ్లే రహదారిలో కొండకు దిగువ భాగంలో బ్రహ్మకుండం వద్ద అప్పట్లో సంవత్సరం పొడువున నీళ్లు ఉండేవి. మునులు ఇక్కడ తపస్సు చేసి ఆలయాల్లో పూజలు చేసేవారని చరిత్ర. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మకుండాన్ని నాలుగేళ్లుగా పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తున్నారు. మర్రిచెట్టు అరుగుపై వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామిని, శివలింగాన్ని మేధా దక్షిణామూర్తిని, అభయాంజనేయస్వామిని ప్రతిష్ఠించారు. సోమవారం సందర్భంగా భక్తులు బ్రహ్మకుండంలో స్నానాలు చేసేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు పూర్తిచేశారు. తూటి కాడలు తొలగించి నీటిని శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. సోమవారం పౌర్ణమికి భక్తులు వేలల్లో వస్తారని కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు.

అన్నదాన నిర్వహణ కోసం విరాళం



నగదు విరాళం అందజేస్తున్న రామారావు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు అమ్మ అనాథాశ్రమంలో నిర్వహిస్తున్న నిరంతర అన్నదాన నిర్వహణ కోసం దాతలు ఆదివారం రూ.5 వేల విరాళం అందజేశారు. అమెరికాకు చెందిన అత్తోట సదాశివరావు, భవాని దంపతులు అన్నదాన నిర్వహణ కోసం తమ అత్తమామలు కొరిటాల రామారావు,సుజాత దంపతుల ద్వారా నగదు విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందుకు అందజేశారు.

యువకుడికి గాయాలు

అద్దంకి రూరల్: బైకుమీద వెళ్తున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటన ఆదివారం రాత్రి మండలంలో గోవాడ వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు వినుకొండ మండలం ఏనుగుపాలేనికి చెందిన కాలవ ఏసోబు అద్దంకి నుంచి బైకుమీద గ్రామానికి వెళ్తున్నాడు. గోవాడ డొంక వద్దకు రాగానే వెనుకనుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయలపాలైన కాలేబును స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువకుడి అదృశ్యంపై కేసు

వేటపాలెం: ఇంటి నుంచి బయటకు వెళ్లి యువకుడు తిరిగి రాకపోవడంపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. మండలంలోని పందిళ్లపల్లికి చెందిన పొగడదండ వెంకటేశ్వర్లు (23) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గత నెల అక్టోబర్ 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అన్ని చోట్లా వెతికినా యువకుడి జాడ తెలియరాలేదు. ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ అని సమాధానం వస్తుందని ఎస్సై తెలిపారు. తండ్రి పొగడదండ పుల్లయ్య నాయుడు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

వాడరేవులో కార్తీక సండే సందడి



పర్యాటకులతో ఆహ్లాదంగా ఉన్న వాడరేవు తీరం

చీరాల టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని వాడరేవు తీరంతో పాటుగా పలు గ్రామాల్లో కార్తీక వన సమారాధనలతో ఆదివారం ఆహ్లాదకరంగా మారింది. కార్తీకమాసం కావడంతో సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకుని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. వాడరేవు తీరానికి చీరాల, పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట తదితర ప్రాంతాలతో పాటుగా తెలంగాణా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో వాడరేవు నిండిపోయింది. చీరాల వాడరేవుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి ఆనందరంగా తీరంలో గడపడంతో వాడరేవులో సందడి నెలకొంది. మెరైన్ పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశారు. అలానే పలు సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వన సమారాధనలో భాగంగా శివునికి ప్రత్యేక పూజలు చేసి సమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు మాట్లాడుతూ పర్యాటకులు జాగ్రత్తగా లోతుకు వెళ్లకుండా స్నానాలు చేయాలని సూచించారు.

బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలి



బీఎల్వోలతో మాట్లాడుతున్న ఆర్డీవో గ్లోరియా

మార్టూరు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చూడాల్సిన బాధ్యత బీఎల్వోలదేనని ఆర్డీవో గ్లోరియా అన్నారు. ఆదివారం ఆమె మండలంలోని కోలలపూడి, తాటివారిపాలెం, బొల్లాపల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బీఎల్వోలు వచ్చిన దరఖాస్తులను రిజిస్టర్‌లో నమోదు చేసి పైఅధికారులకు తెలియజేయాలని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక ఆయుధంలాంటిదని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె ఓట్ల నమోదు కోసం బూత్‌ల వారి వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

